పనులు లేక పస్తులు

నాడు...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప్రతి వార్డులో పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులు జరిగేవి. కార్మికులకు వారంలో ఏడురోజులూ పని దొరికేది. మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో ఆర్థికంగా ఆసరా లభించేది. దీంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా సంతోషంగా రోజులు గడిచేవని కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు.

నేడు...

"ఉదయం 8 గంటలకు క్యారేజీ పట్టుకుని పనికోసం రోడ్డుకు వస్తున్నాం... 10 గంటల వరకు నిల్చుంటున్నాం. పని దొరికితే వెళ్లడం... లేదంటే అష్టాచెమ్మా ఆడుకుని తెచ్చిన క్యారేజీ తినేసి ఇంటిదారి పడుతున్నాం... వారానికి రెండు రోజులు పని దొరకడం కష్టంగా ఉంది.." అని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి బతుకుతెరువు కోసం వలస వచ్చామని, మూడు నెలలుగా సరిగ్గా పనులు దొరక్క ఇంటి అద్దెలు కట్టలేక, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల చదువులు భారంగా మారాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఇసుక కొరతతో నిలిచిన భవన నిర్మాణాలు
- వారంలో రెండు రోజులు కూడా పని దొరకడం కష్టంగా మారిన వైనం
- ఇంటి అద్దె, పిల్లల చదువు భారంగా మారిందని కార్మికుల ఆవేదన
- దసరా పండగ కూడా జరుపుకోలేక పోయామంటున్న కార్మికులు


సీతంపేట కూడలిలో పని కోసం నిరీక్షిస్తున్న భవన నిర్మాణ కార్మికులు


అక్కయ్యపాలెం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు (ఫైల్)

సీతంపేట : ఉచిత ఇసుక అంటూ ఎన్నికల ముందు హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించి భవన నిర్మాణ కార్మికుల నోట్లో మట్టి కొట్టింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఉచిత ఇసుక ఊసే లేదు. అసలు కొందామంటే కూడా ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. ఇసుక దొరక్క పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. మరోవైపు అధిక ధరకు బ్లాకులో ఇసుక కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. మరికొంత మంది ఒడిశా రాష్ట్రం నుంచి ఇసుక తెప్పించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుక సుమారు రూ.900లకు లభించగా, ప్రస్తుతం టన్ను కోసం రూ.2 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఉత్తర నియోజకవర్గంలో 70 శాతం భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. ఫలితంగా కార్మికులకు పనులు దొరక్క ఆకలితో అలమటిస్తున్నారు.

టన్ను ఇసుక రూ.2 వేలు

ఉత్తర నియోజకవర్గంలో ఇసుక స్టాక్ పాయింట్ లేదు. ప్రస్తుతం భవన యజమానులు శ్రీకాకుళం నుంచి బ్లాకులో ఇసుక తెప్పిస్తున్నారు. లేదంటే ఒడిశా నుంచి కొంటున్నారు. ప్రస్తుతం టన్ను ఇసుక కోసం రూ.2 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. 18 టన్నుల ఇసుక లారీ అన్ని చార్జీలతో కలిపి ఉత్తర నియోజకవర్గంలోకి చేరడానికి సుమారు రూ.36 వేలు ఖర్చు అవుతోంది. నియోజకవర్గంలోని సీతంపేట, గురుద్వారా, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో సుమారు 25 వేల నుంచి 28 వేల మంది భవన నిర్మాణ కార్మికులు నివసిస్తున్నారు. ఇసుక కొరతతో గత మూడు నెలలుగా పనులు లేక వారంతా ఇబ్బంది పడుతున్నారు. పనులు లేక చేతిలో చిల్లిగవ్వలేక దసరా పండగ జోష్ కూడా మాయమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో పని కోసం నిరీక్షిస్తున్న కార్మికులు

వారానికి రెండు రోజులే పని



శ్రీకాకుళం నుంచి వలస వచ్చాం. కుటుంబంతో కలిసి రామాటాకీస్ వద్ద వినాయక నగర్‌లో ఉంటున్నాం. తాపీ మేస్త్రీ పని చేస్తుంటాను. నా వద్ద పది మంది కూలీలు ఉన్నారు. ఇసుక దొరక్క మూడు నెలలుగా పనులు లేవు. వారానికి ఒకటి రెండు రోజులే పని దొరుకుతోంది. మిగతా రోజులు ఖాళీగా ఉంటున్నాం. పని దొరికితే మేస్త్రికి రూ.1200, మగ కూలీకి రూ.800, ఆడ మనిషికి రూ.700 ఇస్తారు. పనుల్లేక అప్పులు చేయాల్సి వస్తోంది.

– జె.సూరిబాబు, తాపీమేస్త్రి, వినాయకనగర్

పూట గడవడం కష్టమైంది



క్యారేజీ పట్టుకుని రోజూ ఉదయం 8 గంటలకు సీతంపేట కూలికి వస్తాను. పని కోసం 10 గంటల వరకు ఎదురు చూస్తాను. ఆగిన ప్రతి బండి వద్దకు పరుగుతీస్తాను. పని దొరికితే సరి. లేదంటే ఇంటిముఖం పట్టాల్సిందే. నాలాగే ఇక్కడ వంద మంది వరకు పని కోసం వస్తుంటారు. కొంత మందికి పని దొరికితే కొందరికి దొరకడం లేదు. ఇంటి అద్దె కూడా చెల్లించ లేకపోతున్నాం. పెరిగిన ధరలతో పూట గడవడం కష్టంగా ఉంది.

– పి.సింహాచలం, భవన నిర్మాణ కార్మికుడు, సీతంపేట

పనులు దొరకడం లేదు



గతంలో వారానికి ఏడు రోజులు పని దొరికేది. ప్రస్తుతం మూడు నెలలుగా పనులు దొరకడం లేదు. ఇసుక దొరక్క, ఎక్కువ ధరకు కొనలేక చాలా వరకు పనులు ఆగిపోయాయి. దీంతో మాలాంటి వారికి కూలి పనిలేక ఇల్లు గడవటం కష్టంగా మారింది. దసరా పండగ కూడా సంతోషంగా చేసుకోలేకపోయాం. ప్రభుత్వం చొరవ తీసుకుని ఇసుక లభ్యమయ్యేలా చర్యలు చేపట్టాలి. రోజూ పని దొరికేలా చూడాలి.

– జి.శ్రీను, భవన నిర్మాణ కార్మికుడు, అక్కయ్యపాలెం

ఎన్నికల హామీలు మరిచారు



ఉత్తర నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులు వేలల్లో ఉన్నారు. ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పాత పద్ధతిలో కొనసాగిస్తూ, తన వంతు కోటి రూపాయలు సంక్షేమ నిధికి ఇస్తానని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకోలేదు. మరోవైపు ఉచిత ఇసుక అంటూ ఉదరకొట్టిన కూటమి నాయకులు ఆ హామీని మరిచిపోయారు. ప్రస్తుతం ఇసుక కొందామంటే దొరక్క 70 శాతం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మంత్రులను కలిసినా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదు.

– పడాల రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ)

క్లుప్తంగా

నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు వామనమూర్తి

సీతంపేట : రాష్ట్రంలో భారీగా పెరిగిన వంట నూనె, నిత్యావసర సరకుల ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు, కాయకూరల ధరలు భారీగా పెంచి ఆహార భద్రత లేకుండా చేశాయని మండిపడ్డారు. ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, లేదంటే ప్రజాగ్రహాన్ని చవిచూడక తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రావి కృష్ణ, చిల్లర సంఘం నాయకులు జి.శ్రీనివాసరావు, పి.సాయికుమార్, వెంకటరాయుడు, ఎం.రాము పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


రూపవతి (ఫైల్)

సీతమ్మధార : ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెంలో పురుగుల మందు తాగి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెంలోని ఓ సంస్థలో రూపవతి (26) ఉద్యోగం చేస్తోంది. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూడటంతో కుటుంబ సభ్యులను బెదిరించేందుకు ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయింది. కొద్ది సేపటికి తల్లిదండ్రులు చూసి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదివారం రాత్రి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫోర్త్ టౌన్ సీఐ విజయకుమార్ ఆదేశాల మేరకు హెచ్‌సీ బి.వరలక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక పరిజ్ఞానంతోనే రైలు ప్రమాదాలకు చెక్

సీతమ్మధార : ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, లాట్, డిజిటల్ సెన్సార్ల వినియోగం ద్వారానే దేశంలో రైలు ప్రమాదాలు గణనీయంగా తగ్గించవచ్చని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జేటీ రామారావు సూచించారు. ఆయన ఆశీలుమెట్ట జీవీఎంసీ గాంధీపార్కులో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మీడియాతో మాట్లాడారు. రైళ్లు, ట్రాక్‌లను సురక్షితంగా వుంచేందుకు నిపుణులైన సిబ్బంది తరచూ తనిఖీలు చేయాలన్నారు. రైలు డ్రైవర్లపై పని ఒత్తిడి పూర్తిగా తగ్గించాలన్నారు. రైల్వే యూనియన్ మాజీ నాయకులు కె.రామచంద్రమూర్తి, భక్తుల నీలకంఠం, ఆర్.తాతారావు, వి.శివాజీ, కె.జగదీష్, జి.సుమతి, కె.దానయ్య, కె.రామకృష్ణ, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 8 వినతులు


వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ 8 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలి



ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

సీతంపేట : స్పెన్సర్స్ యాజమాన్యం కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలని ముఠా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రేసపువానిపాలెం స్పెన్సర్స్ హైపర్ మాల్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా 22 మంది కలాసీలు ఇక్కడ లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్నారన్నారు. స్పెన్సర్స్ మాల్ మూసివేతతో వారంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. రోడ్డున పడ్డ వీరికి సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. యాజమాన్యం కలకత్తాలో ఉంటూ లేబర్ ఆఫీసులో జరిగే జాయింట్ మీటింగ్‌లకు హాజరుకాకుండా, కలాసీల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేస్త్రి బి.నూకనాయుడు, బి.ఏసుబాబు, ఎస్.అచ్చంనాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో అన్నసమారాధన


గాంధీనగర్‌లో అన్నసమారాధన ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులు పేట రైల్వేగేటు మార్గం నేతాజీ ఫ్లై ఓవర్ వంతెన వద్ద గల గాంధీనగర్‌లో కుమ్మరి – మేదర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గా దేవి మహోత్సవాల్లో భాగంగా సోమవారం అన్న సమారాధన చేశారు. సంఘం నిర్వాహకుడు దేవారపు రవి నేతృత్వంలో అన్న సమారాధనను మాజీ కార్పొరేటర్, సీపీఎం నాయకురాలు బొట్టా ఈశ్వరమ్మ ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్న సమారాధన చేసినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డి.రమణ, మంగ, సంతోషి, పరమేశ్వరరావు, బుజ్జి, సత్య, శ్రీను, దుమ్ము కిషోర్, తిరుమూర్తులు, మనోజ్ బాబు పాల్గొన్నారు.

రైతుబజార్లలో వంట నూనెల విక్రయాలు

సీతమ్మధార : రైతుబజార్లలో వంటనూనెల విక్రయాలు కొనసాగుతున్నాయి. వంటనూనెల ధరలు తగ్గాయని మార్కెటింగ్ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. ఈ నెల 10న సీతమ్మధార రైతుబజారులో వంటనూనెల విక్రయాల కౌంటర్‌ను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రారంభించిన విషయం తెలిసిందే. విశాఖపట్నంలోని 13 రైతుబజార్ల ద్వారా సన్‌ఫ్లవర్ ఆయిల్ "గోల్డ్ డ్రాప్" లీటర్ రూ.128, క్రిస్టల్ రూ.130, ఫ్రీడమ్ రూ.132కు విక్రయిస్తున్నారు. అలాగే పామాయిల్ లీటర్ రూ.120 వంతున విక్రయించారు. తాజాగా సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.124కి తగ్గింది. అలాగే పామాయిల్ వంట నూనె ధర రూ.110కి తగ్గింది. బహిరంగ మార్కెట్‌లో పామాయిల్ ధర రూ.125, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.138గా వుంది. రైతుబజార్‌లో ఆయిల్ విక్రయాల కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు కోరుతున్నారు.

ఘనంగా దుర్గాదేవి అనుపోత్సవం


దుర్గాదేవి అమ్మవారి అనుపోత్సవంలో కలశాలతో మహిళలు


అనుపోత్సవంలో దుర్గాదేవి అమ్మవారు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెం గాంధీనగర్‌లో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ మేరకు సోమవారం సాయంత్రం అంగరంగ వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి అనుపోత్సవం నిర్వహించారు. బండారు గుప్తాజీ పర్యవేక్షణలో కమిటీ అసోసియేషన్ సభ్యులు అప్పలరాజు, రాజేష్ రెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, దుర్గారెడ్డి, పవన్ కుమార్, రాజు, మురళి, అశోక్‌రెడ్డి, జగదీష్, చిన్నా, రమణమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఊరేగింపులో సన్నాయి మేళాలు, తప్పెటగుళ్లు, కోలాటం ఆకట్టుకున్నాయి. అనుపోత్సవంతో గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్ నరసింహనగర్ ఫీడర్ పరిధిలో చేపడుతున్న నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్ – 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. నరసింహనగర్ రైతుబజార్ ఏరియా, విద్యుత్‌నగర్, జీప్ షోరూం ఏరియా, ఆకాశ్ కాలేజీ ఏరియా, పోర్టు సాగరమాల పరిసరాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతులు


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు పలు సమస్యలపై సోమవారం 06 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ 02, పబ్లిక్ హెల్త్ 02, ఇంజినీరింగ్ విభాగానికి 02 వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరావు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. దసరా సెలవుల అనంతరం మొదటి రోజు పాఠశాలలు తెరవడంతో విద్యార్థుల హాజరు శాతం తగ్గింది. దీన్ని గమనించిన డీఈవో తల్లిదండ్రులను సంప్రదించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులంతా ప్రతి రోజూ పాఠశాలకు హాజరయ్యేటట్లు చర్యలు చేపట్టాలని హెచ్ఎం సిరికి శ్రీనివాసరావుకు సూచించారు. విద్యార్థులతో డీఈవో మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో చదువుకోవాలని చెప్పారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన పర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, నగర ప్రజలు వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించి విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోర్టు హాస్పిటల్ పీపీపీ బిడ్స్ రద్దుకు డిమాండ్


పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్‌ను పీపీపీకి ఇచ్చేందుకు ప్రతిపాదించిన బిడ్స్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, ఆస్పత్రిని పోర్టు అథారిటీయే సొంతంగా నిర్వహించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు మసేన్, హెచ్ఎంఎస్ నాయకుడు మంగనాయుడు, సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, ఐఎన్‌టీయూసీ నాయకుడు గొర్లె చందు, సీఎఫ్‌టీయూ నాయకుడు మూర్తి, బీఎంఎస్ నాయకుడు రవిశంకర్ మాట్లాడారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ఏటా కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. కార్మికుల కష్టాలతోనే వేల కోట్లు సంపాదించి ప్రస్తుతం వారి ఆరోగ్యాన్ని గాలికొదిలేయాలనుకోవడం సరికాదన్నారు. మరో 100 సంవత్సరాలకు సరిపోయే రిజర్వు ఫండ్స్ పోర్టు వద్ద ఉన్నాయని, అయినా ఆస్పత్రిని ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని ఆరోపించారు. రామలింగేశ్వర్రావు, శంకర్రావు, నాయుడు, రాఘవులు, రమణ, పోతన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

కల్వర్టు లేక ప్రమాదకరంగా రోడ్డు


కల్వర్టు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో సాయిబాబా గుడి ముందు రోడ్డు ప్రమాదకరంగా తయారైందని స్థానికులు భయపడుతున్నారు. ఇక్కడి నుంచి బాలయ్యశాస్త్రి లే అవుట్‌కి వెళ్లే మార్గంలో గల కాలువ మీద కల్వర్టు పూర్తి స్థాయిలో లేదు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకూ సుమారు 20 కార్ల టైర్లు ఈ గోతిలో దిగిపోవడం గమనార్హం. రోడ్డు మీద మలుపు తిరిగే సమయంలో రోడ్డు పక్కన గల కాలువ కనిపించకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పాదచారులు కూడా రోడ్డుపై వాహనాలు వచ్చేటపుడు ఎడమవైపు పక్కకి తప్పుకునే క్రమంలో కాలువలో పడిపోతామేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, కాలువ మీద కల్వర్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కేజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుల ఆందోళన


కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

మహారాణిపేట: బకాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ కేజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు సోమవారం ఆందోళనకు దిగారు. 3 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దసరా సందర్భంగా ఇస్తారని భావించినా చెల్లించకపోవడంతో వీరంతా ప్రదర్శన నిర్వహించారు. కేజీహెచ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, జీతాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, సీఐటీయూ నాయకుడు కె.చంద్రశేఖర్ కేజీహెచ్‌లో పనిచేస్తున్న సాయి సెక్యూరిటీ గార్డులు సుమారు 30 మందితో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శన అనంతరం విధులకు హాజరయ్యారు. న్యాయపరమైన డిమాండ్లను తక్షణం ఆమోదించాలని, బకాయి జీతాలు ఇవ్వాలని కార్మికులు నినాదాలు చేశారు. తమకు న్యాయబద్ధమైన జీతం రూ.11,257 ఇవ్వాలని, కాంట్రాక్టర్ రూ.9,090 మాత్రమే ఇస్తున్నారని, కటింగ్‌ల పేరిట మిగిలిన సొమ్ము ఇవ్వడం లేదని సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.